


# నష్టపరిహారం

సిరిపురంలో కాపురం ఉంటున్న రామయ్య తన ఇంటి ముందు పందిరివేసి బచ్చలి పాదు పెంచాడు. బాగా ఎరువువేసి, రోజూ నీళ్ళు పోసి శ్రద్ధచూపడం వల్ల ఏపుగా పెరిగి పందిరి దాటి పిట్టగోడంతా పాకింది.

ఒకరోజు అదే వీధిలో వున్న చుక్కయ్య మేకపోతు పిట్టగోడ ఎక్కి బచ్చలి ఆకులు తిన సాగింది. సమయానికి రామయ్య చూసి మేకను రాయి విసిరి పారదోలాడు. తను ఎంతో కష్టపడి పెంచుకుంటున్న పాదును చుక్కయ్య మేక తినడం, రామయ్యకి బాధ కలిగింది. వెంటనే చుక్కయ్య ఇంటికి వెళ్ళి మేకపోతు బచ్చలి పాదు తినడం గురించి చెప్పి, ఇకనుంచి దాన్ని ఇంట్లో కట్టేసుకోమనీ, లేకపోతే అడవిలోకి పంపి మేపు కోమని సలహా ఇచ్చాడు. చుక్కయ్య 'సరే' అన్నాడు. కాని రామయ్య సలహా వినలేదు. మేకపోతు రెండు, మూడు సార్లు వచ్చి బచ్చలి ఆకులు తినడం, రామయ్య దాన్ని తరమడం జరిగింది.

ఒకరోజు తెల్లవారుతూండగానే మేకపోతు

వచ్చి బచ్చలి పాదు మొత్తం తినేసింది. ఒక్క ఆకు గూడా మిగల్లేదు. రామయ్య అది చూసి కోపంతో గొడ్డలి తీసి మేకపోతు మీదకు విసి రాడు. ఆ దెబ్బకి తల పగిలి మేకపోతు చచ్చి పోయింది. కోపంతో చేసిన పనికి అది చచ్చి పోయినందుకు రామయ్య పశ్చాత్తాప పడ్డాడు. కాని లాభం ఏముంది?

తన మేకపోతును రామయ్య చంపాడని తెలిసి చుక్కయ్య గుండెలు బాదుకుంటూ వచ్చాడు. దాన్ని వందవరహాలు పెట్టికొన్నాననీ, ఆ డబ్బు ఇవ్వమనీ రామయ్యని దబాయించాడు. మేకపోతు మహావుంటే పదివరహాలు ఖరీదు చేస్తుంది.

మేకపోతును చంపినందుకు పదివరహాలు నష్టపరిహారం చెల్లించడానికి రామయ్య ఒప్పు కున్నాడు. లేదా మరొక మేకపోతును కొనిస్తానని అన్నాడు. కాని చుక్కయ్య అందుకు అంగీకరించ లేదు. తన మేకపోతు బహుమేలు జాతికి చెందిన దనీ విదేశాల నుంచీ తెప్పించాననీ వంద వరహాలు చెల్లించాల్సిందే, లేకపోతే దాన్ని బ్రతికించి ఇవ్వ అని మొండి పట్టు పట్టాడు.

రామయ్యకు కోపం వచ్చి "చచ్చిన దాన్ని బ్రతికించడానికి నేనేమైనా దేవుణ్ణా? పది వరహాల కంటే చిల్లిగవ్వ ఎక్కువ ఇవ్వను. నీకు దిక్కున్న చోట చెప్పుకో!" అన్నాడు.

చుక్కయ్య, రామయ్య తన మేకపోతును చంపాడనీ, వందవరహాలు నష్టపరిహారం ఇప్పించ మనీ సిరిపురం రాజుగారికి విన్నవించుకున్నాడు.



రాజుగారు చపల చిత్తుడు. స్థిరమైన నిర్ణయం చెయ్యలేడు. అనుమానం మనిషి ఎవరిది న్యాయమో? దోషి ఎవరో ఒక పట్టాన తేల్చి చెప్పడు. ఎవరేది చెప్పినా 'నిజమేనేమో?' అను కుంటూ కంగారుపడతాడు. అన్యాయంగా తొందరపడి ఎవర్నయినా శిక్షిస్తే పాపం చుట్టు కుంటుందని భయం. రాజు రామయ్యని పిలిపించాడు.

"చుక్కయ్య మేకపోతుని నువ్వు గొడ్డలితో చంపిన మాట నిజమేనా?" అని రాజు, రామయ్యని ప్రశ్నించాడు.

"చిత్తం మహాప్రభూ! నేను కావాలని చంప లేదు. అది మా ఇంట్లోకి చొరబడి బచ్చలి పాదు మొత్తం తినేసింది. కోపం వచ్చి గొడ్డలి విసిరాను. అది చచ్చిపోయింది ప్రభూ!" అన్నాడు రామయ్య.

"అయితే తప్పు నీదేగా? నష్టపరిహారం చెల్లిస్తావా?" అన్నాడు రాజు అనుమానంతో.

"ఇందులో నా తప్పేంలేదు మహాప్రభూ! నేను బచ్చలి పాదు వెయ్యబట్టే ఈ అనర్థం కలిగింది. లేకపోతే ఆ మేకపోతు వచ్చేది కాదు. నా చేతిలో చచ్చేది కాదు" అన్నాడు రామయ్య.

"నిజమే! నువ్వు బచ్చలి పాదు ఎందుకు వేశావు?" అని ప్రశ్నించాడు రాజు.

"మా ఎదురింట్లో వున్న ఎల్లయ్య బచ్చలి గింజలు ఇచ్చాడు మహాప్రభూ! అందువల్ల వాటిని మా ఇంట్లో నాటాను. ఇదంతా ఎల్లయ్య తప్పే! కాబట్టి నష్టపరిహారం ఎల్లయ్య ఇచ్చుకోవాల్సిందే!" అన్నాడు రామయ్య.

రాజుకి నిజమే అనిపించింది. రాజభటుల్ని పంపించి ఎల్లయ్యని పిలుచుకుని రమ్మన్నాడు. ఎల్లయ్య గడగడ లాడుతూ వచ్చాడు.

"రామయ్యకి నువ్వు బచ్చలి గింజలు ఇచ్చిన మాట నిజమేనా?" అని ప్రశ్నించాడు రాజు.

"నిజమే! మహాప్రభూ!" అని ఒప్పుకున్నాడు ఎల్లయ్య.

"నువ్వు రామయ్యకి బచ్చలి గింజలు ఇచ్చినందువల్ల వాటిని ఇంటిముందు నాటి పెంచాడు. చుక్కయ్య మేకపోతు బచ్చలి పాదు తినేసింది. రామయ్య గొడ్డలి విసిరాడు. మేకపోతు చచ్చిపోయింది" అన్నాడు రాజు.

"మహాప్రభూ! ఇందులో నా తప్పు ఎంత మాత్రం లేదు, విశ్వనాథాచారిది". అన్నాడు ఎల్లయ్య.

"విశ్వనాథాచారి ఎవరు?" అన్నాడు రాజు.

"వైద్యుడు ప్రభూ! నాకు శరీరమంతా దురదలు వస్తే మందుకోసం వెళ్ళాను. ఒక సంవత్సరమంతా ఆకు కూర తింటే నయం అవుతుందన్నాడు. అన్ని కాలాలలోనూ పచ్చగా ఉంటుంది. నీకు ఇబ్బంది ఉండదని అతనే బచ్చలి ఆకు కూర గింజలు ఇచ్చాడు. కాబట్టి దీనికి మూలకారకుడు విశ్వనాథాచారి మహాప్రభూ!" అన్నాడు ఎల్లయ్య.

రాజుకు ఎల్లయ్య చెప్పింది నిజమే అనిపించింది. విశ్వనాథాచారి అనే వైద్యుడిని కచేరీకి రమ్మని కబురు పెట్టాడు ఈ తలతిక్క రాజు తనని ఎందుకు రమ్మన్నాడో అర్థంకాక కంగారు పడుతూ వచ్చాడు వైద్యుడు.

"ఏమయ్యా ఆచారీ! ఎల్లయ్యకి కంటికి దురద లొచ్చి నీ దగ్గరికి వస్తే మందు ఇవ్వాలిగాని, బచ్చలి ఆకు రోజూ తినమని విత్తనాలు ఇస్తావా?" అని దబాయించాడు రాజు.

"ఏం జరిగింది మహాప్రభూ?" అన్నాడు విశ్వనాథాచారి అయోమయంగా.

"చాలా నష్టం జరిగింది. ఎల్లయ్య ఆ బచ్చలి విత్తనాలు కొన్ని రామయ్యకి ఇచ్చాడు. రామయ్య పాదు పెంచాడు. దాన్ని చుక్కయ్య మేకపోతు తినేసింది. రామయ్యకి కోపం వచ్చి గొడ్డలి విసిరాడు. మేకపోతు చచ్చిపోయింది. పాపం చుక్కయ్య దాన్ని వందవరహాలు పోసి విదేశాల నుంచి కొనుక్కొచ్చాడట. ఆ నష్టపరిహారం ఎవరివ్వాలి? బచ్చలి విత్తనాలు ఇచ్చిన నీదే తప్పు

కదా?" అన్నాడు రాజు.

రాజు చెప్పినదంతా విని విశ్వనాథాచారికి నెత్తిన పిడుగు పడింది. ఈ తల తిక్కరాజుకి ఎట్లా చెప్పాలా? అని ఆలోచించాడు. రాజు తెలివి తక్కువ తనం అవకాశంగా తీసుకుని వీళ్ళు నష్ట పరిహారం తన నెత్తిన రుద్దటానికి పూనుకున్నారని అర్థమైంది. మామూలుగా చెప్తే రాజు వినడు. తెలివిగా సమాధానం చెప్పి ఈ ఆపద నుంచి తప్పుకోవాలి అనుకున్నాడు.

"మహాప్రభూ! వంటి దురదలు పోవడానికి మందుకన్నా ఆకుకూర శ్రేష్టమైనది. తోటకూర, పాలకూర వంటివి ఎండాకాలం బ్రతకడం కష్టం. బచ్చలి కూర అన్ని కాలాలలోనూ పచ్చగా పెరుగు తుంది. అందువల్ల దాని గింజలు ఇచ్చాను. పాదు చేసి ప్రతిరోజూ తినమన్నాను. అది వైద్యం మహాప్రభూ! వైద్యుడిగా నా ధర్మం నెరవేర్చాను. దానికి కారణం నేను వైద్యుడిగా ఈ ఊళ్ళో వుండడం వల్లనే గదా! నేను లేకుండా వున్నట్లయితే ఈ అనర్థం జరిగేది కాదు మహారాజా!" అన్నాడు విశ్వనాథాచారి.

రాజుకి బుర్ర తిరిగింది. పాపం వైద్యుడు చెప్పేది గూడా నిజమే కదా! అనుకున్నాడు.

"అవునూ! అసలు ఈ ఊళ్ళో నువ్వెందుకు వున్నావు?" అని ప్రశ్నించాడు రాజు.

"చక్కటి ప్రశ్న వేశారు మహాప్రభూ! ఇందులో నా తప్పు ఎంతమాత్రమూ లేదు. నేను మా గురువుగారి దగ్గర వైద్యం నేర్చుకుంటూ వుండగా తమరి తండ్రి శ్రీశ్రీశ్రీ నరసనాయకుడు గారు విచ్చేసి తమ వూరికి వైద్యుడు లేడనీ, మంచి వైద్యుడని పంపవలసిందిగా కోరారు. మా గురువు నన్ను ఈ వూరు పంపారు. తమ తండ్రిగారి ఆజ్ఞ మేరకు నేనీ వూరు రావడం జరిగింది ప్రభూ!" అన్నాడు విశ్వనాథాచారి.

అతను చెప్పింది సమంజసంగా తోచింది రాజుగారికి. తప్పంతా తన తండ్రిదే అను కున్నాడు.

"వైద్యుడా! నువ్వు చెప్పింది బాగానే వుంది. ఇందులో నీ తప్పులేదు. కాని తండ్రి బ్రతికి లేడు. చచ్చిపోయిన వారు నష్టపరిహారం ఎలా చెల్లి స్తారు?" అని సందేహం వెలిబుచ్చాడు రాజు.

'హమ్మయ్య రాజుగారు దారిలోకి వచ్చాడు' అనుకుని సంతోషించాడు విశ్వనాథా చారి.

"తండ్రి ఆస్థిపాస్తులకు కొడుకు వారసు డైనట్లే, తప్పులకు గూడా వారసుడే మహాప్రభూ! కాబట్టి మహాప్రభువులే నష్టపరిహారం చెల్లించి బీదవాడైన ఎల్లయ్యను ఆదుకోవడం ధర్మం మహారాజా!" అన్నాడు వైద్యుడు.

"వైద్యుడు చెప్పింది ధర్మమే! ఎల్లయ్యకు వందవరహాలు నష్టపరిహారం ఖజానా నుంచి చెల్లించండి" అని కోశాధికారిని ఆజ్ఞాపించాడు రాజు.

తల తిక్కరాజుకి తగిన విధంగా బుద్ధి చెప్పి నందుకు ప్రజలు వైద్యుడి తెలివి తేటలు మెచ్చుకున్నారు.